

రాయదుర్గం పట్టణంలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో గౌరీదేవిగా భక్తులకు దర్శనం

యాడికిలో గాయత్రీదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి





జేజేలు కొడుతూ అమరావతికి కదులుతున్న డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు

ఆనందంగా అమరావతికి!

ప్రత్యేక బస్సుల్లో వెళ్లిన ఎంపికైన ఉపాధ్యాయులు

- వారితోపాటు కదిలిన కుటుంబసభ్యులు
- నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికయిన ఉపాధ్యాయులు బుధవారం ఆనందంగా అమరావతికి పయనమయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ మేరకు పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఐదు నెలలకే మొత్తం నియామకాల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతిలో మెగా డీఎస్సీ విజయోత్సవ సభను ప్రభుత్వం ఈనెల 25న ఏర్పాటు చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 811 టీచర్ పోస్టులకు గాను 755 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. అలాగే జోనల్-4స్థాయిలో పీజీటీ, టీజీటీ పోస్టులకు జిల్లా స్థాయిలో దాదాపు 100 మందికి పైగా ఎంపికయ్యారు. ఈ అభ్యర్థులందరితో పాటు వారి కుటుంబ సభ్యులలో ఒకరు అమరావతికి బయలుదేరారు. వీరికి జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా 45 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం ఉదయం పీవీకేకే కళాశాల నుంచి అమరావతికి బయలుదేరి వెళ్లారు. వారివెంట డీఈఓ ప్రసాద్‌బాబుతో (మిగతా 8లో...)

ఆంధ్రజ్యోతికి రుణపడి ఉంటా



నాది ధర్మవరం. డీఎస్సీ ఇంగ్లీషులో 48వ ర్యాంకు. నియామక ప్రక్రియలో నాకన్నా కింది స్థాయి ర్యాంకు వారిని ఎంపిక చేశారు. ఆ సమయంలో నాకు జరిగిన అన్యాయంపై అర్హత ఉన్నా పోస్టుకు ఎంపిక చేయలేదని ఆంధ్రజ్యోతి పేపర్లో రాశారు. తర్వాత జిల్లా, రాష్ట్ర విద్యాశాఖాధికారులు స్పందించి తప్పును సరిదిద్ది నాకు ఉద్యోగ ఎంపిక జాబితాలో అవకాశం కల్పించారు. నాకు అమ్మానాన్నలేరు. నాకు ఉద్యోగం రావడానికి అవకాశం కల్పించిన ఆంధ్రజ్యోతికి రుణపడి ఉంటా.

-ఆంజనేయులు, ధర్మవరం



బహురూపిణీ.. పాహిమాం..!



సేవాఘడ్‌లో..



తాడిపత్రిలో...

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలలో మూడో రోజు బుధవారం విశేష అలంకరణలు చేశారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో మాతా జగదాంబ అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలలో అమ్మవారు కళ్యాణదుర్గంలో బాలాత్రిపుర సుందరిగా, రాయదుర్గంలో గౌరీదేవిగా, తాడిపత్రిలో శ్రీశైల భ్రమరాంబగా భక్తులను అనుగ్రహించారు. యాడికి పట్టణంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

-ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

సోలార్ పార్కుకు ప్రతిపాదనలు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోలార్ పార్కుకు సంబంధించి భూమిని పరిశీలించి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. విజయవాడలోని సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి బుధవారం ప్రభుత్వ భూములపై అనంతపురం, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, వైఎస్‌ఆర్ కడప జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీసీఎల్‌ఏ, స్పెషల్ సీఎస్ జయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. తాడిపత్రి పరిధిలోని తలారి చెరువు, ఆలూరు గ్రామాల పరిధిలో సోలార్ పార్కుకు సంబంధించి 26.48 ఎకరాల భూమిని పరిశీలించి, త్వరితగతిన ప్రతిపాదనలు పంపుతామన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి

జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో భూసేకరణపై సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, జేసీ శివ్‌నారాయణ శర్మతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. రైల్వే, ఏపీ జెన్‌కో, ఏపీఐఐసీ, ట్రాన్స్‌కో, సోలార్ పార్కులు, రహదారులకు భూసేకరణపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... రాప్తాడు ఎంఎస్ఎంఈ పార్కుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని తహసీల్దార్, ఆర్డీఓను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, తిప్పేనాయక్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఎన్‌హెచ్ పీడీ తరుణ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



కుమారిని వీల్‌చైర్‌లో ఉంచుకుని, వేచిచూస్తున్న భర్త నాగరాజు, కుమార్తె వెన్నెల

- అనంత నగర పరిధిలోని రుద్రంపేటకు చెందిన కుమారిపై ఆమె తమ్ముడు గొడవపడి కత్తితో తీవ్రంగా దాడి చేశాడు. తీవ్రరక్తస్రావమై, ప్రాణాపాయంలో ఉన్న కుమారిని మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో సర్వజన ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు తీసుకొచ్చారు. కుమారిని డాక్టర్లు పరీక్షించి అల్ట్రాసౌండ్, సిటీ స్కానింగ్‌లు చేయించుకురావాలని రసీదులు రాసిచ్చారు. స్కానింగ్‌కు తీసుకెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో ఎమర్జెన్సీలోనే కుమారి హాహాకారాలు చేస్తూ పడిపోయింది. దీంతో కుమారిని వీల్‌చైర్‌లో కూర్చోబెట్టుకుని ఆమె భర్త నాగరాజు, కుమార్తె వెన్నెల స్కానింగ్‌కు తీసుకెళ్లారు. స్కానింగ్‌లు పూర్తిచేసుకుని తిరిగి ఎమర్జెన్సీకి వచ్చే సరికి దాదాపు రెండుగంటలు దాటింది.



ఎమర్జెన్సీలో రోగికి ఇంజెక్షన్ వేస్తున్న నర్సింగ్ సిబ్బంది

- అనంతపురం నగరానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి తీవ్ర రక్త గాయాలతో ఆస్పత్రికి వచ్చాడు. అతడి వెంట వచ్చినవారు మద్యం మత్తులో జోగుతున్నారు. తోచినట్లుగా మాట్లాడుతున్నారు. వివరాలు సరిగా చెప్పట్లేదు. వారి తీరుతో వైద్యసిబ్బంది భయంతో వణికిపోతున్నారు. ఆ సమయంలో మత్తులో ఉన్నవారిని బయటకు పంపాల్సిన సెక్యూరిటీ సిబ్బంది కనుచూపు మేరలో కనిపించలేదు. దీంతో వైద్య సిబ్బంది పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.



రవికుమార్‌రెడ్డితోపాటు మూడో రోడ్డులో దాడికి గురైన ప్రకాష్‌ను పరీక్షిస్తున్న పీజీ విద్యార్థులు

ఆస్పత్రి కాదు.. అరణ్యం..!

ఆంధ్రజ్యోతి విజిట్

అర్ధరాత్రి సర్వజనాస్పత్రిలో ఆర్తనాదాలు

- అత్యవసర విభాగంలోనూ అందని వైద్యం
- ప్రాణాపాయంలో ఉన్నవారిని పట్టించుకునే వారు కరువు
- వీల్ చైర్లు, స్ట్రెచర్లు కుటుంబీకులు తోసుకోవాల్సిందే..
- కనిపించని సెక్యూరిటీ
- కాన్పుల వార్డులో అన్నీ గర్భిణుల వెంటవచ్చిన వారు చేసుకోవాల్సిందే..
- స్కానింగ్, బ్లడ్‌బ్యాంకు కేంద్రాలకు తలుపులేసుకుని నిద్రలో సిబ్బంది

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం సర్వజనాస్పత్రి ఉమ్మడి జిల్లాకు పెద్దదిక్కు. అలాంటి వైద్యశాలకు ఎంతో మంది నిత్యం ప్రాణాపాయ పరిస్థితిలో వస్తుంటారు. ఆ సమయంలో అత్యవసరంగా సరైన వైద్యం అందితే ఎంతో మంది బతుకుతారు. మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకంతోనే బాధితులు అర్ధరాత్రి సర్వజనాస్పత్రికి వస్తుంటారు. వైద్యశాలలో మాత్రం పట్టించుకునేవారు కరువవుతున్నారు. కాదు.. కాదు.. కనిపించరు కూడా. మంగళవారం అర్ధరాత్రి 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాణాపాయ పరిస్థితుల్లో అత్యవసర విభాగానికి తీసుకొచ్చిన వారిని దించుకునే ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలు లేరు. క్షతగాత్రుల బంధువులే దింపాల్సిందే. వారే వీల్‌చైర్, స్ట్రెచర్ తెచ్చుకుని, వాటిపై ఉంచుకుని ఎమర్జెన్సీ వార్డులోకి తోసుకెళ్తూ కనిపించారు. అక్కడ వైద్యుడు లేరు. హౌస్ సర్జన్లు మాత్రమే ఉన్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ఎలాంటి వైద్యం చేయాలో అర్థంకాక వారు దిక్కులు చూస్తున్నారు. ఏమీ పాలుపోక స్కానింగ్‌లు, రక్త పరీక్షలకు రాసి పంపారు. బాధితుడిని తరలించేందుకు సిబ్బంది లేరు. ఉన్నా.. పట్టించుకోరు. దీతో మళ్లీ కుటుంబ సభ్యులే వీల్‌చైర్‌లో, స్ట్రెచర్‌లో దారిలో కనిపించిన వారిని అడుగుతూ స్కానింగ్ కేంద్రానికి తరలించారు. అక్కడ చేయించారు. తర్వాత రక్త పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ నమూనాలు ఇచ్చాక.. ఫలితాల కోసం గంటల తరబడి వేచిచూశారు. చివరికి ఫలితాలు తీసుకుని, ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లారు. అప్పటికే రెండు గంటలు దాటింది. అప్పుడు వైద్యులు (మిగతా 8లో...)

ప్రత్యామ్నాయం.. అంతే?

- ఈ ఏడాది ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ లేనట్లే
- గత నెల మొదటి వారంలోనే ప్రతిపాదనలు
- పట్టించుకోని రాష్ట్ర ఉన్నతాధికారులు
- నిరాశలో చిన్న, సన్నకారు రైతులు



ఆత్మకూరు మండలంలో బీడుగా ఉన్న పొలం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లా రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తన పంపిణీ లేనట్లేనని తెలుస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆశించిన స్థాయిలో పంటలు సాగు కాలేదు. ఈ నేపథ్యంలో ఆగస్టు మొదటి వారంలో జిల్లాకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయ యంత్రాంగం రాష్ట్ర కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపింది. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో ప్రధాన పంటల సాగు చేయని పక్షంలో సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీ చేస్తూ వస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం ప్రత్యామ్నాయ పంటల విత్తన పంపిణీలో విఫలమయ్యారు. దీంతో కొందరు రైతులు బహిరంగ మార్కెట్‌లో ప్రత్యామ్నాయ విత్తనాలు కొనుగోలు చేసి, విత్తుకున్నారు. ఈ నెలాఖరు దాకా ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవకాశం ఉన్నా ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయకపోవడం దారుణమని పలువురు చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయకపోవడంపై పలువురు ప్రజాప్రతినిధులు వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని ప్రశ్నించారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ జరిగేలా చూడాలని సూచించారు. అయినప్పటికీ ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

గత నెలలో ప్రతిపాదనలు

గత నెల మొదటి వారంలోనే ప్రత్యామ్నాయ విత్తనాల కోసం జిల్లా వ్యవసాయ యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. అప్పట్లో జిల్లాలో 48240 హెక్టార్లల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 9245 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఉలవలు 5945 క్వింటాళ్లు, పెసలు 1504, అలసంద 1050, కొర్ర 262, జొన్నలు 484 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. గత ఏడాదితో పోలిస్తే తీవ్ర ఆలస్యం కావడంతో ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ జోలికే వెళ్లలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు రెండో వారంలోనే సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. అప్పట్లో 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఎక్కువ శాతం చిన్న, సన్నకారు రైతులు విత్తనం వేయలేకపోయారు. అక్టోబరు నుంచి రబీ సీజన్ ఆరంభం కానుంది. గత కొన్ని రోజులుగా పప్పుశనగ విత్తనాల సరఫరా టెండర్లు ఖరారు చేయడంలో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు తర్జనభర్జన పడుతున్నా.. ఇంకా కొలిక్కి రాలేదు. ఈ పరిస్థితుల్లో ఈ సారి ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ లేనట్లేనని తెలుస్తోంది.

మార్కెట్‌లో కొన్నా..



సకాలంలో పదును వాన రాకపోవడంతో వేరుశనగ పంట సాగు చేయలేకపోయా. ప్రభుత్వం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తుందని ఆశతో ఎదురుచూశా. పలు మార్లు వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి అడిగినా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో బయట మార్కెట్‌లో ఉద్దులు కొనుగోలు చేసి, విత్తేశా. ఐదు ఎకరాలకు 12 ప్యాకెట్లు ఉద్దులు అవసరం అయ్యాయి. ప్యాకెట్ ఉద్దులు రూ.600లతో కొనుగోలు చేశా. ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేసి ఉంటే ఆ డబ్బులు మిగిలేవి. ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో, పొలాన్ని ఖాళీగా ఉంచుకోలేక బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి విత్తుకున్నా.

-శ్రీనివాసులు, రైతు, చిన్నమట్లగొంది, శింగనమల మండలం

చాలా దారుణం



ఈ సారి వర్షాభావ పరిస్థితులతో అనేక మంది రైతులు ప్రధాన పంటలు సాగు చేయలేకపోయారు. ఆగస్టు మొదటి వారంలోనే సబ్సిడీ పై ప్రత్యామ్నాయ పంటల విత్తనాల కోసం జిల్లా వ్యవసాయ యంత్రాంగం రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోకపోవడం దారుణం. రాష్ట్ర ఉన్నతాధికారులు వైఖరి వల్లే జిల్లాలోని అనేక మంది చిన్న, సన్నకారు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయలేక పోయారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

చంపేశారా..?

కాలాపురం వద్ద వైసీపీ కార్యకర్త అనుమానాస్పద మృతి





ఘటనా స్థలంలో దేవన సతీష్‌కుమార్ రెడ్డి మృతదేహం, ఇన్‌సెట్‌లో ఫైల్

పామిడి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాలాపురం గ్రామ శివారులో వైసీపీ కార్యకర్త దేవన సతీష్ కుమార్‌రెడ్డి (34) అనుమానాస్పదంగా మృతి చెందారు. ఇదే మండలంలోని జి.కొట్టాల గ్రామానికి చెందిన కాశీనాథ్ రెడ్డి కుమారుడు సతీష్ కుమార్ రెడ్డి. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన సతీష్, కొన్నాళ్లపాటు వేరే ప్రాంతాల్లో ఉద్యోగం చేశారు. ఎనిమిదేళ్ల క్రితం గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయం చేస్తున్నారు. వ్యక్తిగత పని నిమిత్తం బుధవారం బైక్‌పై పామిడికి వచ్చి రాత్రి 9 గంటల సమయంలో స్వగ్రామానికి బయలుదేరాడు. తర్వాత ఏం జరిగిందోగానీ.. కాలాపురం శివారులో రక్తపుమడుగులో పడి కనిపించాడు. గొంతుమీద లోతైన గాయం ఉండటంతో ఇది హత్య అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మృతదేహానికి పక్కనే ద్విచక్ర వాహనం పడి ఉంది. పాద రక్షలు దూరంగా విసిరేసినట్లు ఉన్నాయి. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని చూస్తున్నారని స్థానికులు వ్యాఖ్యానించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కజొన్న వర్షార్పణం

- కోత కోసిన తరువాత వర్షాలు
- పొలాల్లోనే తడిసిపోయిన దిగుబడి
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

తడిసిన పంటను ఆరబోసిన రైతు



8

పార్లమెంటులో చట్టం చేయించండి

వాల్మీకి, బోయల అంశంపై ప్రభుత్వ విప్ కాలవ



8

మొక్కజొన్న వర్షార్పణం

● కోత కోసిన తరువాత వర్షాలు ● పొలాల్లోనే తడిసిపోయిన దిగుబడి ● తీవ్రంగా నష్టపోతున్న రైతులు



ట్రాక్టర్‌లోకి వేస్తున్న మొక్కజొన్న పంట

వర్షాలకు తడవకుండా మొక్కజొన్న కంకులపై టార్పాలిన్

విడపనకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మొక్కజొన్న రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బోరుబావుల కింద మే నెలలో సాగు చేసిన పంటను ఇటీవల కోశారు. కంకులను మిషన్‌కు వేసి, ధాన్యాన్ని పొలాల్లోనే ఆరబోశారు. అప్పటి నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. వాటిని ఆరబెట్టే వీలు లేకపోగా, వర్షపు నీటికి తడిసి ముద్దయ్యాయి. ఇలాగే వదిలేస్తే మొత్తం దిగుబడి పోతుందని ఆందోళన చెంది.. పొలాల్లోంచి రోడ్డు మీదకు ట్రాక్టర్‌లలో తరలిస్తున్నారు. పూర్తి స్థాయిలో ఎండలు కాస్తే విత్తనం కొంతవరకూ రంగు మారకుండా ఉంటుంది. లేదంటే రంగు మారి, తగిన ధర లభించదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చీకలగురికి బొజ్జప్ప 5 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాడు. కోత కోశాక వర్షాలు రావడంతో మొత్తం తడిసిపోయింది. మొక్క జొన్న సొప్ప కూడా మిగల్లేదు. అంతా పొలంలోనే వదిలేశాడు. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, అంతా వర్షపునీటిలో తడిసిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రామక్రిష్ణ అనే రైతు రెండు ఎకరాల్లో పంట సాగు చేశారు. కోత కోసి, కంకులను పొలంలోనే కుప్పగా పోశారు. సుమారు 60 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. ఇది కూడా వర్షానికి తడిసిపోయింది. ఉవరకొండ నియోజవర్గంలో మొక్కజొన్న సాగు చేసిన రైతులందరి పరిస్థితి ఇలాగే ఉంది. వేల ఎకరాల్లో పంటలను కోత కోసి, పొలాల్లోనే కుప్పలుగా వేశారు.

ఎండ కాయకపోతే నష్టమే..



నేను 5 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. మే నెలలో పంట పెడితే ఈ నెలలో కోతకు వచ్చింది. కుటుంబ సభ్యులు అందరం కలిసి పొలంలో కష్టపడ్డాము. మంచి దిగుబడి వచ్చింది. కానీ కోత కోశాక వర్షాలు రావటంతో దిగుబడి మొత్తం తడిసిపోయింది. విత్తనాలు గుగ్గిళ్లలా మారాయి. పొలంలోని విత్తనాలను రోడ్డుపైకి తెచ్చేందుకు కూలీలకు రూ.9 వేలు, ట్రాక్టర్ బాడుగ రూ.6 వేలు ఖర్చు అయింది. నాలుగు రోజులపాటు ఎండలు బాగా కాస్తే విత్తనం రంగు మారకుండా ఉంటుంది. లేదంటే రూ.3 లక్షలకు పైగా నష్టం వస్తుంది. - బొజ్జప్ప, చీకలగురికి



తడిసిన మొక్కజొన్న విత్తనాలను తిరిగేస్తున్నరైతు

మొత్తం తడిసిపోయింది..

నేను రెండు ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. కోత కోశాక వర్షాలు రావడంతో పంట మొత్తం తడిసిపోయింది. టార్పాలీన్ కప్పినా కింది నుంచి నీరు వెళుతోంది. రోజుల తరబడి కప్పి ఉంచితే కంకులు నల్లగామారిపోతాయి. ఏమి చేయాలో తెలియడం లేదు. సుమారు 60 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. రూ.1.50 లక్షలు నష్టపోయాను. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- రామక్రిష్ణ, బూదగవి

పార్లమెంటులో చట్టం చేయించండి

వాల్మీకి, బోయల అంశంపై ప్రభుత్వ విప్ కాలవ

అనంతపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు పార్లమెంటులో చట్టం చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడారు. సామాజిక హోదాలో మార్పు కోసం వాల్మీకి, బోయలు ఎప్పటి నుంచో ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వాల్మీకి, బోయలు షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారని 1961లో సెన్సస్ కమిషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ రాయి బర్మన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఏపీ ట్రైబల్ కమిషన్‌తో పాటు 2017లో సత్యపాల్ కమిటీ సైతం వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చాలని సిఫార్సు చేసిందని అన్నారు. బోయలను ఎస్టీల్లో చేర్చాలని ఎన్టీఆర్ తొలిసారి ఆలోచించారని అన్నారు. ఆయన ఆలోచనలను కార్యరూపంలో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నించారని అన్నారు. 2017 డిసెంబరు రెండో తేదీన శాసన సభలో ఈ అంశాన్ని ప్రతిపాదించారని, శాసన సభ తీర్మానం చేయించి, కేంద్రానికి సిఫార్సు చేశారని అన్నారు. ఈ ప్రతిపాదనలో ఆరు అంశాలపై కేంద్రం వివరణ కోరిందని, వైసీపీ ప్రభుత్వం సరైన వివరణ ఇవ్వకపోగా, ఏకసభ్య కమిషన్ పేరుతో కాలయాపన చేసిందని విమర్శించారు. రాయలసీమలో ఉన్న వాల్మీకి బోయలను మాత్రమే ఎస్టీల్లో చేర్చాలని కేంద్రానికి నివేదిక పంపిందని అన్నారు. రాష్ట్రంలోని పాతిక లక్షల మంది వాల్మీకి, బోయలు చంద్రబాబును తమ దేవుడుగా భావిస్తారని, ఆయన ద్వారానే తమకు న్యాయం జరుగుతుందనే విశ్వాసంతో ఉన్నారని అన్నారు. అక్టోబరు 7న వాల్మీకి జయంతి ఉందని, ఆ రోజు ఎలా గడపాలో అర్థంకాని సందిగ్ధత వాల్మీకి బోయల్లో నెలకొందని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు ఇతర ప్రభుత్వ పెద్దలకు నచ్చజెప్పి పార్లమెంటులో చట్టం చేసేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు. బీజేపీ, జనసేన నేతలు కేంద్రం వద్ద పలుకుబడిని ఉపయోగించి, చట్టం చేసేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి: ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజక వర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో బుధవారం ఆమె మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక రోడ్లకు నిధులు ఇస్తున్నారని, తమ నియోజకవర్గంలో ఇప్పటికే చాలా చోట్ల రోడ్ల సమస్యలు పరిష్కారమయ్యాయని కృతజ్ఞతలు తెలిపారు. మరికొన్ని రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని అన్నారు. అనంతపురం నగర శివారులోని టమోటా మండీల నుంచి కనగానపల్లి మీదుగా చిగురు చెట్టు వరకూ, తగరకుంట నుంచి ఎగువపల్లి, తగరకుంట నుంచి నూతిమడుగు, చిగిచెర్ల వరకూ ప్రధాన రహదారులను నిర్మించాల్సి ఉందని తెలిపారు. రోడ్లు దెబ్బతిన్న కారణంగా ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యాలేరు, తగరకుంట గ్రామాల మధ్యలో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, ఇంకా 15 కి.మీ. పనులు నిధులు లేక ఆపాల్సి వస్తోందని వివరించారు. రహదారుల పనులకు రూ.150 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భారత్ ఫైబర్ పరుగులు..!

తక్కువ ధరలతో ల్యాండ్‌లైన్ కాల్స్, టీవీ చానల్స్, ఓటీటీలు

ఫైబర్ నెట్ డీలర్ల సమన్వయంతో సేవలు

ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం డిస్కౌంట్

అమల్లోకి హైస్పీడ్ ఇంటర్నెట్ ప్లాన్‌లు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ తమ కస్టమర్లకు భారత్ ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక ప్లాన్‌లను అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం ఇంట్లో టీవీలకు ఇంటర్‌నెట్ సౌకర్యం పెరిగింది. అందుకనుగుణంగా ప్రైవేట్ కంపెనీలు రకరకాల ఖరీదైన మోడమ్‌లతో ఇంటర్‌నెట్ సేవలతో పాటు టీవీ చానల్స్, ఓటీటీ యాప్స్‌ను తీసుకొచ్చాయి. వాటి ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్రైవేట్ టెలికాం సర్వీసుల కన్నా తక్కువ ధరలకే ఇంటర్‌నెట్, టీవీ చానల్స్, ఓటీటీ సేవలను అందిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని ప్లాన్లపై 10 శాతం డిస్కౌంట్‌ను అమలు చేస్తోంది. ఇప్పటికే వేల సంఖ్యలో కస్టమర్లు ఈ సేవలను వినియోగిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

రూ.400కే 444 చానల్స్, 9 ఓటీటీలు..

బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెట్టిన భారత్ ఫైబర్ ద్వారా అనేక రకమైన సేవలను అందిస్తోంది. రూ.400 రీచార్జ్‌పై ల్యాండ్‌ఫోన్‌కు అన్‌లిమిటెడ్ లోకల్, ఎస్టీడీ కాల్స్, రూ.500 సెక్యూరిటీ డిపాజిట్, 20 ఎంబీపీఎస్ స్పీడుతో 500 జీబీ వరకూ నెట్, ఆ తరువాత 2 ఎంబీపీఎస్ స్పీడుతో నెట్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ ప్లాన్ ద్వారా దాదాపు 444 పైగా టీవీ చానళ్లను అందిస్తోంది. వీటిలో ప్రధానంగా జెమినీ సిరీస్, ఈటీవీ హెచ్‌డీ సిరీస్, జీ సిరీస్, స్టార్ మా హెచ్‌డీ, నిక్ జూనియర్ తదితర చానళ్లను అందిస్తోంది. వీటితో పాటు 9 రకాల ఓటీటీలకు అవకాశం కల్పించింది. అందులో స్టార్టప్లే టీవీ, ఓటీటీ ప్లే, డిస్ట్రో టీవీ, ఈటీవీ విన్, సన్ ఎన్ఎక్స్‌టీ, ఫ్యాన్‌కోడ్, ఓం టీవీ, రెడ్ హాట్, ఫ్రైడే ఓటీటీ చానళ్లు ఉంటాయి. ఈ ప్లాన్‌లో చేరాలంటే రూ.260 ఎఫ్‌టీటీహెచ్ రీచార్జ్‌తో పాటు రూ.140 టీవీ చానళ్లకు కలిపి మొత్తం రూ.400 రీచార్జ్ చేయాల్సి ఉంటుంది.

హైస్పీడ్ ఇంటర్నెట్ ప్లాన్‌లు..

బీఎస్ఎన్ఎల్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను ఓ మోస్తారు ధరలతో తీసుకొచ్చింది. అందులో రూ. 399 నుంచి అమలు కానున్నాయి. వీటిలో ప్రధానంగా రూ. 449 రీచార్జ్ చేసుకుంటే... 50 ఎంబీపీఎస్ స్పీడు ఇంటర్‌నెట్ సేవలు 6 నెలల వాలిడిటీతో వర్తిస్తాయి. ఇందులో అన్‌లిమిటెడ్ కాల్స్, ఓటీటీ యాప్స్ ఉంటాయి. రూ.799 రీచార్జ్‌పై 125 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 4000 జీబీ డేటా సేవలు, రూ. 599 రీచార్జ్‌పై 75 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 4000 జీబీ డేటా, రూ.1299 రీచార్జ్‌తో 225 ఎంబీపీఎస్ స్పీడుతో 6000 జీబీ డేటా వర్తిస్తుంది. వీటితో పాటు మరో రెండు ప్లాన్ త్వరలో అమల్లోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఫైబర్ నెట్ డీలర్లతో సమన్వయం

బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెట్టిన భారత్ ఫైబర్ ఇంటర్‌నెట్ సేవలను కస్టమర్లకు అందించేందుకు ఫైబర్ నెట్ డీలర్లతో సమన్వయం చేసుకుంటోంది. నెట్ సేవలు అందిస్తున్న టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్‌తో ఈ సేవలను కస్టమర్ల ఇంటివద్దకే వెళ్లి కనెక్షన్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటోంది. ఇంట్లో ల్యాండ్‌లైన్ ఫోన్ ఉన్న కస్టమర్లకు ఫోన్ ద్వారా కేబుల్ కనెక్షన్‌తో నెట్ సేవలు అందిస్తోంది. వాయిస్ కాల్స్ వద్దనుకున్న కస్టమర్లకు మోడమ్ సాయంతో ఇంటర్‌నెట్‌తో పాటు టీవీ చానల్స్, ఓటీటీ చానళ్ల సదుపాయం కల్పించింది.

హైస్పీడుతో భారత్ ఫైబర్ కనెక్షన్లు



భారత్ ఫైబర్ పేరుతో కస్టమర్లకు బీఎస్ఎన్ఎల్ పలు రకాల సేవలను అందిస్తోంది. రూ. 400 ప్లాన్‌తో ప్రారంభమై అత్యధిక స్పీడుతో అందించే పలు రకాల ప్లాన్లను అమలు చేస్తోంది. బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు ఎక్కడున్నా హైస్పీడు ఇంటర్‌నెట్‌తో పాటు టీవీ చానళ్లు, ఓటీటీలను అందించేందుకు చర్యలు తీసుకుంది. భవిష్యత్తులో కస్టమర్లను ఆకర్షించే ప్లాన్లు మరిన్ని అమలు కానున్నాయి.

-ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్

ఆనందంగా అమరావతికి!



సూచనలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, పీవీకేకే విద్యాసంస్థల డైరెక్టర్ పల్లె కృష్ణకిషోర్ రెడ్డి

(7వ పేజీ తరువాయి)

పాటు ప్రతిబస్సుకు ఒక ఎంఈఓ లేదా హెచ్‌ఎం, ఒక పీడీ, ఒక కానిస్టేబుల్ పర్యవేక్షణకు వెళ్లారు. మొత్తం మీద రెండు వేలమందికి పైగా అనంత నుంచి అమరావతి బాటపట్టారు.



అమరావతికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

● ఎంతో సంతోషంగా ఉంది



డీఎస్సీలో పీడీగా ఎంపికయ్యాను. నోటిఫికేషన్ ఇచ్చి వెంటనే పరీక్షలు నిర్వహించి, నియామకాలు చేపట్టడం ఆనందంగా ఉంది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో నియామకాల పత్రాలు అందించడం మరింత సంతోషం కలిగిస్తోంది.

-స్రవంతి. నార్శింపల్లి, కనగానపల్లి మండలం

● నా కొడుకుతోపాటు వెళుతున్నా



మాది గొరిదిండ్లతండా. నా కొడుక్కి టీచర్ ఉద్యోగం వచ్చింది. విజయవాడకు రమ్మన్నారంటే పోతున్నాం. నాకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. ఇపుడు రవికుమార్‌నాయక్ అనే కొడుక్కి ఉద్యోగం వచ్చింది. మిగిలిన వాళ్లందరికీ పెళ్లిళ్లు చేశా. ఇపుడు రవికి ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ఈయప్పకు ఇక పెళ్లిచేయాలి.

-హనుమంతునాయక్, గొరిదిండ్లతండా, ఆత్మకూరు మండలం

● ఇంత త్వరగా ఇవ్వడం మా అదృష్టం



నేను ఫిజికల్ సైన్స్ టీచర్‌గా ఎంపికయ్యాను. 2018లో పోటీపడినా పోస్టు రాలేదు. అప్పటి నుంచి ఓ వైపు భర్త, పిల్లలను చూసుకుంటూనే కష్టపడి చదువుకుంటూ వచ్చాను. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా నియామకాలకు రెండేళ్లు పట్టేది. ఇపుడు డీఎస్సీ ఇవ్వడం, ఇందులో ఉద్యోగం పొందడం, ఇంత త్వరగా నియామకాలు ఇవ్వడం మా అదృష్టంగా భావిస్తున్నా.

-హరిణి, షేక్షానుపల్లి, ఉరవకొండ మండలం

● మా ఇంట్లో మూడు భాషల టీచర్లు



మా నాన్న ఇంగ్లీష్ టీచర్.. మా అమ్మ తెలుగు టీచర్.. ఇపుడు నేను హిందీ టీచర్‌గా ఎంపికయ్యాను. మా ఇంట్లో మూడు భాషల టీచర్లు ఉండడం ఎంతో సంతోషంగా ఉంది. డీఎస్సీ అంటేనే టీడీపీ ప్రభుత్వం, చంద్రబాబునాయుడు గుర్తుకొస్తారు. డీఎస్సీ ఇచ్చి వెంటనే నియామకాలు చేపట్టడం మేము చేసుకున్న పుణ్యమే.

-కౌశిక్ శాస్త్రి, అనంతపురం

● నాలుగేళ్ల కష్టానికి ప్రతిఫలం



మాది పేద కుటుంబం. మా అమ్మానాన్న కుటుంబ పోషణ కోసం ఎంతో కష్టపడుతుంటారు. అందుకే ఉద్యోగం కొట్టాలని నాలుగేళ్లుగా ఊరు వెళ్లకుండా అనంతపురంలోనే ఉంటూ సాయిగంగ కోచింగ్‌సెంటర్‌లో ప్రిపేర్ అవుతూ వచ్చాను. ఆ దేవుడిలా చంద్రబాబు సీఎం కావడం, డీఎస్సీ ఇవ్వడం, ఇక్కడ టీచర్ ఉద్యోగం రావడం మరవలేనిది. నాలుగేళ్ల కష్టానికి కూటమి సర్కారు ద్వారా ప్రతిఫలం దక్కింది.

- జీవన, బొమ్మక్కపల్లి, రాయదుర్గం మండలం

ఆంజనేయులు సరే.. నా సంగతేంటి..?

టీజీటీకి అర్హత ఉంది.. న్యాయం చేయండి

డీఈఓ వద్ద బాధిత అభ్యర్థి వరలక్ష్మి ఆవేదన

అనంతపురంవిద్య, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ బీసీ-ఏ కేటగిరీలో ఆంజనేయులుకు తొలుత అన్యాయం చేసారు.ముందుసారి జాబితాలో ఉన్న తనను ఇపుడు తొలగించారు, సవరించి ఆంజనేయులుకు న్యాయం చేసారనీ, అది ఓకే, అయితే తనకు ఇతర టీజీటీ పోస్టులో అర్హత ఉంది, ఎందుకున్యాయం చేయలేదని డీఎస్సీ అభ్యర్థి వరలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు. వరలక్ష్మి తొలి ఎంపిక జాబితాలో ఇంగ్లిష్‌లో బీసీ-ఏ కేటగిరీలో అవకాశం కల్పించారు. అదే సబ్జెక్టులో ధర్మవరానికి చెందిన ఆంజనేయులు 76.28 మార్కులతో 48వ ర్యాంకులో ఉన్నారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా 49వ ర్యాంకు అభ్యర్థిని జనరల్ కేటగిరీలో ఎంపిక చేశారు. ఆ తర్వాత స్థానంలో కూడా ఆంజనేయులుకు అవకాశం ఇవ్వకుండా కింది ర్యాంకుల వారిని ఎంపిక చేశారు. దీనిపై ఆంజనేయులు.. డీఈఓని సంప్రదించడంతో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆంజనేయులకు ఎంపిక జాబితాలో చోటు కల్పించారు. బీసీ-ఏ కేటగిరిలో ముందు జాబితాలో ఇంగ్లిష్‌లో చివరగా ఎంపికైన వరలక్ష్మి పేరును తొలగించారు. అమరావతికి రావద్దని డీఈఓ కార్యాలయం నుంచి ఫోన్ చేసి, చెప్పారు.



డీఈఓను కలిసిన బాధిత అభ్యర్థి వరలక్ష్మి

ఆనందం నుంచి ఆవేదనలోకి..

తనకు ఉద్యోగం వచ్చిందని ఆనందంలో ఉన్న వరలక్ష్మి డీఈఓ కార్యాలయం ఫోన్‌తో ఆవేదనలోకి వెళ్లిపోయింది. బుధవారం పీవీకేకే కళాశాలకు కుటుంబసభ్యులతో వచ్చి డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి, ఆంజనేయులకు న్యాయం చేయడానికి తన పేరు తొలగించారనీ, టీజీటీ ఇంగ్లిష్‌లో 250వ ర్యాంకుఉందనీ న్యాయం చేయాలని కోరారు. తనకన్నా తక్కువ ర్యాంకు ఉన్నవారిని ఎంపిక చేశారనీ, తనకు అన్యాయం చేశారని వాపోయారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇందుకు డీఈఓ స్పందిస్తూ.. వివరాలను డీఈఓ కార్యాలయంలో ఇవ్వాలని సూచించగా.. అక్కడకు వెళ్లి అందించారు. ఇక్కడ పరిశీలించి, విషయాన్ని ఆర్జేడీ శామ్యూల్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆస్పత్రి కాదు.. అరణ్యం..!

(7వ పేజీ తరువాయి)

పరీక్షించి, తాపీగా వార్డుకు తరలించారు. ఈ సమయంలో ప్రాణం పోతే ఎవరిది బాధ్యత? ప్రాణాపాయ పరిస్థితుల్లో వచ్చిన వారికి వెంటనే వైద్యం అందించి, వారి ప్రాణాలను కాపాడాలన్న కనీస బాధ్యతను డాక్టర్లు విస్మరిస్తుండడం శోచనీయం.

అన్నీ కుటుంబ సభ్యులే చూసుకోవాలి..

కాన్పుల వార్డులో ఇబ్బందులు వేరేలా ఉన్నాయి. పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భవతులు కూడా ఇక్కడ తిప్పలు పడాల్సిందే. రక్త పరీక్షలను కుటుంబ సభ్యులే చేయించుకు రావాల్సిందే. రక్త నామూనాలు సేకరించేందుకు ల్యాబ్‌కెళ్లి గాజు ట్యూబులను వారే తెచ్చుకోవాలి. తిరిగి వాటిని ఇచ్చి రావాలి కూడా. సులువుగా కాన్పులు జరగడానికి, బీపీ కంట్రోల్ ఉంచడానికి, ఇతర సమస్యలకు అవసరమైన మందులను బయటికెళ్లి కొనుక్కొచ్చుకోవాల్సిందే.

తలుపులేసుకుని నిద్రలోకి..

అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కించాలంటే క్రాస్‌మ్యాచింగ్ చేయాలి. బ్లడ్‌బ్యాంకు, స్కానింగ్ కేంద్రాలకు వెళ్తే అక్కడి సిబ్బంది తలుపులు వేసుకుని నిద్రలోకి జారుకుంటున్నారు. గట్టిగా అరిచినా వారు నిద్రమత్తులో నుంచి బయటకు రావడంలేదు. ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓలు, సెక్యూరిటీ సిబ్బంది వంతులవారీగా పనిచేస్తున్నారు. ఒక్కోసారి మూకుమ్మడిగా విశ్రాంతి తీసుకుంటున్నారు.

చికిత్స చేయట్లేదు: శీను, బేతంచెర్ల, నంద్యాల జిల్లా



రామాంజనేయులు ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆస్పత్రికి తీసుకొస్తే వైద్యులు పట్టించుకోవట్లేదు. వెంటనే వైద్యం చేయట్లేదు. స్కానింగ్‌లు రాసిస్తే మేమే స్ట్రెచర్‌లో తోసుకెళ్లి, చేయించుకుని వచ్చాం. ట్రీట్‌మెంట్ చేయమంటే నిర్లక్ష్యంగా ఉన్నారు. ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోకుంటే ఎలా?

సూదిమందు లేదంట: షబానా, తాడిపత్రి



మా చెల్లెలు షకిలాను కాన్పునకు తీసుకొచ్చాం. డాక్టర్లు పరీక్షించి, మాత్రలు ఇచ్చారు. బీపీ ఎక్కువగా ఉందనీ, ఇంజక్షన్ వేయాలన్నారు. ఆస్పత్రిలో సూదిమందులేదనీ, బయటికెళ్లి తీసుకురావాలని రాసిచ్చారు. మా ఇంట్లోవాళ్లకి చీటీ ఇచ్చి పంపా. అర్ధరాత్రి ఎక్కడ దొరుకుతుందో.. ఏమో?

ఎక్కడిస్తారో తెలియదు: వెంకటమ్మ, కుటాగుళ్ల, కదిరి



నా కూతురు లావణ్యను ప్రసవానికి తీసుకొచ్చా. డాక్టర్లు సిజేరియన్ చేయాలన్నారు. రక్త పరీక్షలు చేయాలనీ, గాజు ట్యూబ్‌లు తెచ్చుకోవాలని చీటీ రాసిచ్చారు. ఎక్కడిస్తారో తెలియక అంతా తిరిగాను. మళ్లీ వార్డుకెళ్లి డాక్టర్లను అడిగితే పైన 19వ నంబరు అనిచెప్పారు. అప్పుడు వెళ్లి.. తెచ్చుకున్నా.



కాన్పులవార్డు వద్ద బాధిత కుటుంబ సభ్యుల నిరీక్షణ

తాళం వేసిన ఇంట్లో చోరీ



20 తులల బంగారం, రెండు కిలోల వెండి మాయం

బుక్కపట్నం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భారీ చోరీ జరిగింది. తాళాలను పగులగొట్టి ఓ ఇంట్లోకి చొరబడిన దొంగలు, 20 తులాల బంగారం, రెండు కేజీల వెండి, రూ.10 వేల నగదును ఎత్తుకువెళ్లారు. బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా, మెయిన్‌రోడ్డు పక్కనే ఈ చోరీ జరగడం కలకలం రేపుతోంది. బాధితురాలు సవితమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మన్న తెలిపారు. సవితమ్మ హైదరాబాద్‌లో ఉన్న కుమారుడు సిద్దు వద్దకు 15 రోజుల క్రితం వెళ్లారు. తన కూతురు, కోడలికి చెందిన బంగారం ఆభరణాలను ఇంట్లోనే ఉంచారు. ఇంటికి తాళం వేయడాన్ని పసిగట్టిన దొంగలు, మంగళవారం రాత్రి చొరబడ్డారు. దొంగతనం జరిగినట్లు బుధవారం ఉదయం గమనించిన స్థానికులు సవితమ్మకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి పరిశీలించి, ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదు చోరీ అయినట్లు గుర్తించారు. ఇన్‌చార్జి ఎస్ఐ లింగన్న ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. డాగ్ స్క్వాడ్ చేత తనిఖీ చేయించారు.



బీరువాలోని వస్తువులను చిందవందర చేసిన దృశ్యం, చోరీ జరిగిన ఇంట్లో డాగ్ స్క్వాడ్



నృసింహావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

నృసింహావతారంలో శ్రీవారు



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

కదిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు బుధవారం నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం నృసింహావతారంలో ఉన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు నృసింహావతారంలో భక్తులను కనువిందు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

గుంతకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు 78 రోజుల జీతాన్ని బోనస్‌గా చెల్లించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రతి సంవత్సరం రైల్వే ఉద్యోగులకు దసరాకు ముందు బోనస్‌ను ప్రకటించి, చెల్లిస్తోంది. ఈ మేరకు బుధవారం ఉదయం కేంద్ర మంత్రివర్గం సమావేశమై ఉత్పాదకత ఆధారిత బోనస్ కింద రైల్వే ఉద్యోగులు, కార్మికులకు 78 రోజుల వేతనం గరిష్ఠంగా రూ.17,951 బోనస్‌ను ప్రకటించింది. త్వరలో ఆ మొత్తాలను రైల్వే శాఖ పంపిణీ చేయనుంది.

రెండోరోజూ కొనసాగిన పీజీ అడ్మిషన్లు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ అడ్మిషన్ల ప్రక్రియ రెండోరోజు బుధవారం కొనసాగింది. తొలిరోజు 17 మంది అడ్మిషన్ పొందారు. రెండోరోజు 66 మంది అడ్మిషన్లు పొందినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్స్ ప్రొఫెసర్ నరసింహన్ తెలిపారు. గురువారం కూడా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు.

862.23 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కోరమాండల్ కంపెనీకి చెందిన 862.23 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను పరిశీలించామని తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు... ఏపీ మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాలకు 336, మన గ్రోమోర్, ప్రైవేటు డీలర్లకు 526.23 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని వెల్లడించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

డ్వామా పీడీ సలీంబాషా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనులకు వచ్చే ఉపాధి కూలీల సంఖ్యను మరింతగా పెంచాలని డ్వామా పీడీ సలీం బాషా ఆదేశించారు. తన కార్యాలయం నుంచి క్లస్టర్ ఏపీడీలు, ఏపీఓలు, ఏసీలు, టీఏలతో ఆయన బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాకాలం ముగిసేలోపు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్లవద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన 31 గ్రామ పంచాయతీల్లో యుక్తధార్ అమలును పకడ్బందీగా చేయాలని సూచించారు.

టమోటా కిలో రూ.24

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.14, సరాసరి ధర రూ.18 విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఇబ్బడి ముబ్బడిగా లే అవుట్లు



అనధికార లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న అహుడా అధికారులు

- 818 అక్రమ లే అవుట్ల గుర్తింపు
- 375 మాత్రమే క్రమబద్ధీకరణ
- ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోకపోతే బ్లాక్‌లిస్ట్‌లోకి..
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతోనే ఈ దుస్థితి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బడి ముబ్బడిగా లేఅవుట్లు వేశారు. వీటిలో సింహభాగం వైసీపీ నాయకులు, సానుభూతి పరులవే ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేకుండా వేసిన 818 లేఅవుట్లను అహుడా అధికారులు గుర్తించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) పరిధిలో 818కి పైగా లేఅవుట్లలో 8వేల ఎకరాల్లో విస్తరించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన లేఅవుట్ రీఅసెస్‌మెంట్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)తో అనధికార లేఅవుట్లు వెలుగులోకి వస్తున్నాయి. వీటిలో 80 శాతానికి పైగా వైసీపీ నేతలకు చెందినవే ఉండడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే విజిలెన్స్ అధికారులు అనధికార లేఅవుట్లపై నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదు. వీటిని క్రమబద్ధీకరించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎల్‌ఆర్‌ఎస్‌తో ఉమ్మడి జిల్లాలోని 818 అనధికార లేఅవుట్లలో సుమారు 40వేల మందికిగా లబ్ధిచేకూరనుంది. ఇప్పటి వరకు 375 లేఅవుట్లను ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలోకి తీసుకువచ్చారు. అక్టోబరు 24వతేదీ లోపు ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోని అక్రమ లేఅవుట్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోకపోతే బ్లాక్‌లిస్టులోకి..

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోని లేఅవుట్లను బ్లాక్‌లిస్టులో పెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 818 అక్రమ లేఅవుట్లను గుర్తించిన అహుడా అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ చేసేపనిలో నిమగ్నమయ్యారు. ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోని లేఅవుట్లను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో విద్యుత్, మంచినీరు, రోడ్లు లాంటి మౌలిక వసతులు కల్పించబోమని అహుడా అధికారులు హెచ్చరిస్తున్నారు. మరీ ముఖ్యంగా అక్రమ లేఅవుట్లలో భవననిర్మాణాలకు అనుమతిచ్చేది లేదని చెబుతున్నారు. అనుమతులు తీసుకోకుండా వేసిన లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. కొందరు అధికారులు వైసీపీ నేతలతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లకు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోవాలి..



అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాల్సిందే. లేదంటే బ్లాక్‌లిస్టులో పెట్టేస్తాం. అహుడా పరిధిలో ఇప్పటి వరకు 818 అనధికార లేఅవుట్లను గుర్తించాం. వీటిలో 375 లేఅవుట్లను ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకున్నారు. మిగిలినవి కూడా అక్టోబరు 24వతేదీలోపు క్రమబద్ధీకరించుకోవాలి. అనధికార లేఅవుట్ల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోంది. భవన అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రభుత్వం దృష్టి సారించింది. అనధికార లేఅవుట్లను ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం. అనధికార లే అవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు పొందే అవకాశం ఉండదు.

- టీసీ వరుణ్, చైర్మన్, అహుడా

జడ్పీ కాంప్లెక్స్ టెండర్‌లో రింగ్..!

- నిబంధనల ఉల్లంఘన
- ఒకరి పేరుతోనే పలు గదులకు టెండర్లు



టెండర్ ప్రక్రియను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలోని గదులను దక్కించుకోవడంలో టెండర్‌దారులు రింగ్అయినట్లు తెలుస్తోంది. వారికి యంత్రాంగం సహకారం అందించినట్లు స్పష్టమవుతోంది. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలోని డీపీఆర్‌సీ సమావేశ భవనం వెనుక వైపు సాయినగర్ రోడ్డుకు ఉన్న జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 12 గదులను అద్దెకు ఇవ్వడానికి టెండర్ నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం జడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో టెండర్లను ఓపెన్ చేశారు. జాబితాను పరిశీలించిన సీఈఓ.. పలు గదులకు సంబంధించి ఒకే పేరు మీద టెండర్ నమోదు కావడంతో కంగుతిన్నారు. పార్కింగ్ లేదన్న నెపం చూపి నగర నడిబొడ్డున ఉన్న గదులకు రూ.4,500 అద్దె నిర్ణయించినట్లు తెలిసింది. రూ.4,600 నుంచి రూ.5000 లోపే టెండర్లు నమోదు చేసి గదులను దక్కించుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. అధికారులు ప్రారంభంలో ఒక్కొక్క గదికి రూ.8,500గా నిర్ణయించాలనుకున్నప్పటికి చివరికి రూ.4,500కే నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి తోడు పలు గదులకు ఒకే పేరు మీద టెండర్ నమోదు చేయడాన్ని పరిశీలిస్తే.. ప్రభుత్వం నిర్ణయించిన దానికన్నా స్వల్ప ఆధిక్యంతో టెండర్ దక్కించుకునే ప్రయత్నం చేశారన్న ప్రచారం జరుగుతోంది. డిమాండ్ ఉన్న ప్రాంతం. ఇంతకంటే ఎక్కువ నమోదు చేసేవారు ఉన్నారు. సరైన సమాచారం ఇవ్వకుండా అధికారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా చేశారన్న ప్రచారం జరుగుతోంది. జాబితాను బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచారు. దీంతో పలు అనుమానాలకు దారి తీస్తోంది. దీనిపై పాలకులు, కలెక్టర్ విచారణ చేసి తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రేషన్ డీలర్లకు ఈ-పోస్ మిషన్ల పంపిణీ



డీలర్‌కు ఈ-పోస్ మిషన్ అందజేస్తున్న జేసీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ డీలర్లకు పాత ఈ-పోస్ మిషన్ల స్థానంలో అధునాతన యంత్రాలను పంపిణీ చేశారు. నగరంలోని కృష్ణకళామందిరంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ బుధవారం వాటిని ఆత్మకూరు, కూడేరు, గార్లదిన్నె మండలాలకు చెందిన డీలర్లకు అందజేశారు. జేసీ మాట్లాడుతూ.. నూతన యంత్రాలతో రేషన్ పంపిణీలో పారదర్శకత వస్తుందన్నారు. జిల్లాలోని 1645 దుకాణాల డీలర్లకు కొత్త మిషన్లు 27వ తేదీలోగా అందజేసి, శిక్షణ ఇవ్వాలని విజన్ టెక్ ఇంజనీర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డైరెక్టర్‌గా లోకేశ్ ప్రమాణ స్వీకారం





బాల లోకేశ్‌ను అభినందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురం క్రైం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన బాల లోకేశ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి హాజరై, అభినందించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచీ బాలలోకేశ్ ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

గోవా మద్యం స్వాధీనం

- 5,460 బాటిళ్లు పట్టివేత.. నలుగురి అరెస్ట్
- వెంబడించి పట్టుకున్న అధికారులు



లిక్కర్, నిందితులను చూపుతున్న అధికారులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఇన్నోవా కారులో తరలిస్తుండగా అధికారుల అడ్డుకున్నారు. నిందితులు ఇన్నోవా వాహనంతో తప్పించుకునే ప్రయత్నం చేయగా.. అధికారుల బృందం వెంబడించి పట్టుకుంది. వారి నుంచి 116 బాక్సుల్లో 5,460 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలను వెల్లడించారు. ఉదయం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఇతర సీఐలు వడ్డుపల్లి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్నారు. ఒక ఇన్నోవా కారు, ఒక మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారులో గోవా అక్రమ మద్యం ఉన్నట్టు గుర్తించారు. వారిని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పట్టుకోగా.. ఇన్నోవా వాహన డ్రైవర్, మరో వ్యక్తి అధికారులపై ఎదురుతిరిగి తప్పించుకుని పారిపోయేందుకు యత్నించారు. తగరకుంట, బాలసంద్రం వైపు వెళ్లగా వెంబడించి పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులు, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాల్లోని 116 పెట్టెల్లో ఉన్న అక్రమ గోవా మద్యం 5,460 బాటిళ్ల 1003.32 లీటర్ల మద్యం పట్టుకున్నారు. రెండు వాకీటాకీ సెట్లు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులు వీరేంద్ర, ప్రవీణ్, వెంకటేష్, పవన్ కుమార్‌ను అరెస్టు చేశారు. కార్యక్రమంలో సీఐలు అన్నపూర్ణ, అలీ బేగ్, జయనాథ్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్ఐలు నరేష్‌బాబు, హరికృష్ణ, సత్యనారాయణ, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరిధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 414టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కర్నూలు ఇన్‌చార్జి డీఐజీగా విజయలక్ష్మి

కర్నూలు డీఆర్‌గా భార్గవ్‌కు ఎఫ్‌ఏసీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా డీఐజీగా పనిచేస్తున్న విజయలక్ష్మికి కర్నూలు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కర్నూలు డీఐజీ పీజీఎస్ కల్యాణి రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రిలీవ్ అవడంతో విజయలక్ష్మికి కర్నూలు డీఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్‌ఏసీ) అప్పగిస్తూ ఆ శాఖ ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్యాణి కర్నూలు జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కొనసాగేవారు. ఈ నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌కు కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) అప్పగించారు.

అక్టోబరు 31న కుంభాభిషేకం

ముహూర్తాన్ని నిర్ణయించిన చినజీయర్ స్వామి

గుంతకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ గోపురాల కలశస్థాపన, కుంభాభిషేకానికి చినజీయర్ స్వామి ముహూర్తాన్ని నిర్ణయించారు. స్వామివారి పేరును అనుసరించి అక్టోబరు 31న ఈ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. బంగారు కలశాలను తయారు చేయించి, ఉత్తరాయన పుణ్యకాలంలో కుంభాభిషేకాన్ని నిర్వహించాలని ఆలయ అధికారులు మొదట భావించారు. కానీ ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే తొలుత గోపురాలకు కలశ స్థాపన, కుంభాభిషేకాలను నిర్వహించాలని త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి సూచించారు. దీనికి సమయం తక్కువగా ఉండటంతో బంగారు కలశాల స్థానంలో పంచలోహ కలశాల తయారీకి ఆర్డర్ ఇచ్చారు. అక్టోబరు 29వ తేదీ నుంచి మూడు రోజులపాటు కలశ స్థాపన, కుంభాభిషేక ఉత్సవాలను నిర్వహిస్తామని ఈఓ విజయరాజు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణం నుంచి ఆలయం వరకూ భక్తులు, దాతలతో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

టమోటా కొనుగోలు చేస్తాం

జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్ర కుమార్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమోటా కొనుగోలు చేస్తామని ఆ శాఖ ఏడీ రాఘవేంద్ర కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు టమోటా కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారని తెలిపారు. ఈ మేరకు బుధవారం రాప్తాడు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా కొనుగోలు చేపట్టామని తెలిపారు. కిలో రూ.20తో కొనుగోలు చేశామని పేర్కొన్నారు. వాటిని వైజాగ్‌లోని రైతుబజారుకు తరలించామని అన్నారు. ప్రస్తుతం అక్కడ ధరలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడి నుంచి కొనుగోలు తరిస్తున్నామని తెలిపారు. దీని వలన ఇక్కడి రైతులకు లాభం చేకూరడంతోపాటు..ఎగుమతి ప్రాంతాల్లోని ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు.

లారీల్లో డీజిల్ చోరీ

600 లీటర్లు అపహరించిన దొంగలు

యాడికి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన రెండు లారీల్లో నుంచి 600 లీటర్ల డీజిల్ చోరీ చేసిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని పెద్దపేట గ్రామంలో చోటుచేసుకుంది. పెద్దపేట గ్రామానికి చెందిన లారీ యజమానులు వేణు, నాగేంద్ర తెలిపిన మేరకు.. మంగళవారం రాత్రి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో లారీలను పార్కింగ్ చేశారు. ఉదయం లారీల వద్దకు వచ్చి లారీల్లో ఉన్న 600 లీటర్ల డీజిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించామని తెలిపారు. చోరీ జరిగిన డీజల్ విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం



గంగాధర్ నాయుడు (ఫైల్)

నంబులపూలకుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపాన కదిరి-రాయచోటి రోడ్డులో అన్నమయ్య జిల్లా సరిహద్దు ప్రాంతంలో బుధవారం ద్విచక్రవాహనాన్ని బొలెరో ఢీకొనడంతో రైతు గంగాధర్ నాయుడు అలియాస్ బుచ్చప్ప (35) దుర్మరణం చెందారు. అతడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పల్లెనివారిపల్లికి చెందిన గంగాధర్ నాయుడు వ్యవసాయం చేసుకుంటుండేవాడు. బుధవారం పని నిమిత్తం అన్నమయ్య జిల్లాలోని వెలిగల్లుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండెంవారిపల్లి రోడ్డులో వెళ్తుండగా, వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగాధర్‌నాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గంగాధర్‌నాయుడు తండ్రి వీరమల్లప్పనాయుడు పెద్దకర్మ ఆదివారం నిర్వహించారు. మూడు రోజులకే కుమారుడు మరణించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోలీసులు కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

కూడేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జల్లిపల్లి గ్రామానికి చెందిన రాకెట్ల లక్ష్మి(25) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఈనెల 22న లక్ష్మి భర్త లింగమయ్య పని నిమిత్తం తోటకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మికి కడుపునొప్పి అధికమైంది. బాధ భరించలేక పురుగుల మందు తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన బంధువులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం రాత్రి మృతిచెందారు.

యువతి అదృశ్యం

కూడేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నెకు చెందిన శిరీష అనే యువతి కూడేరులో అదృశ్యమయ్యారు. గార్లదిన్నె నుంచి నెల రోజుల క్రితం ఆమె కూడేరులోని బంధువుల ఇంటికి వచ్చారు. మంగళవారం అదృశ్యం కావడంతో ఆమె తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీనియారిటీ జాబితా ప్రకటించి, ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఆందోళనకు దిగారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, బదిలీలకు ముందే సీనియారిటీ జాబితా ప్రకటిస్తామన్న ప్రభుత్వం.. ఏడాదిన్నరగా కాలయాపన చేస్తోందని అన్నారు. వెంటనే సీనియారిటీ జాబితాను విడుదల చేసి, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల 9 నెలల ప్రొబేషన్ పీరియడ్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటింటా సర్వే సేవలను సచివాలయ ఉద్యోగులకు పూర్తిగా రద్దు చేయాలని, నిర్దిష్ట జాబ్‌చార్ట్ ప్రకారం విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాయినింగ్ తేదీ ఆధారంగా బదిలీలు చేసిన తరహాలోనే ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో జేఏసీ నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, హనుమంతు, మల్లికార్జున, చంద్ర రామకృష్ణ, కిశోర్, శిరీష, మాధవి, సునీత, గిరి, ప్రసాద్, ప్రదీప్ పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ అంబికా


దర్శనానంతరం ఆలయం వద్ద ఎంపీ ఇతర నేతలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి పర్వదినాల వేళ అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న దేర్గాదేవిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. తర్వాత ఆయన అన్నపూర్ణాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, గడ్డం సుబ్రమణ్యం, రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, ఎంపీజ కుమారుడు అంబికా వీక్షిత్ పాల్గొన్నారు.

మేయర్ క్షమాపణ చెప్పాలి: టీడీపీ


మాట్లాడుతున్న పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై అవాకులు, చవాకులు పేలుతున్న నగరపాలక సంస్థ మేయర్ వసీం వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే చాంబర్ ముట్టడిస్తామని పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం డైరెక్టర్లు బొమ్మినేని శివ, పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహ, కడియాల కొండన్న విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటి నగరంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తుంటే... సంతోషించాల్సి పోయి.. మేయర్ విషం చిమ్ముతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ ప్రొటోకాల్ గురించి మాట్లాడుతున్నారని, ఆయనకు మా ప్రభుత్వంలోనే గౌరవం వచ్చిందని, ఆ ప్రొటోకాల్ ఇచ్చింది కూడా ఎమ్మెల్యే దగ్గుపాటేనని గుర్తుచేశారు. దగ్గుపాటి మున్సిపాలిటీపై పెత్తనం చేయాలనుకుంటే.. మేయర్ గేటు కూడా దాటలేరంటూ వారు హెచ్చరించారు. లేనిపోని ఆరోపణలు చేసిన వసీం ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని అన్నారు. అలాగే కార్పొరేటర్ జనబలం బాబా, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సైఫుద్దీన్, ఇతర నాయకులు కూడా అదే కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మేయర్ వసీం ఎమ్మెల్యే దగ్గుపాటికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర నిధులతో చేపట్టిన పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయకూడదని ఎక్కడ రాసిందని నిలదీశారు. కమిషనర్ బాలస్వామి కూటమికి అనుకూలంగా పనిచేస్తున్నారంటూ ఆయన్ను బెదిరిస్తున్నారని, కమిషనర్ మీ ఇంట్లో పనిమనిషి కాదంటూ వారు మేయర్‌పై మండిపడ్డారు.

'మహానంద రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో'

అనంతపురం క్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత మహానందరెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలంటూ టీడీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహతోపాటు, పలువురు నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీసులు స్టేషన్‌కు పిలిపిస్తే... దాని వెనుక ఎమ్మెల్యే దగ్గుపాటి ఉన్నాడంటూ మాట్లాడం సరికాదన్నారు. మహానందరెడ్డి ఒక రౌడీ షీటర్ కాబట్టే పోలీసులు చట్టప్రకారం స్టేషన్‌కు పిలిపించారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయన ఎన్నిసార్లు స్టేషన్‌కు వెళ్లారో గుర్తు చేసుకోవాలని సూచించారు. మిడిమిడి జ్ఞానంతో సూపర్‌సిక్స్ సభ గురించి మాట్లాడం సబబుకాదన్నారు.సభ పార్కింగ్ కోసం అధికారులు అంచనా వేస్తే.. రూ.12 లక్షలు ఎమ్మెల్యే తన సొంత నిధులతో పరిహారం ముందే చెల్లించారని తెలిపారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. నాయకులు నాగార్జున, శివ, జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో వైద్యశిబిరం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు గ్రామంలో సోమవారం కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మనోజ్ స్థానిక పంచాయతీ కార్మికులతో పాటు పలువురు గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ.. గురు, శుక్రవారాల్లో ఆకుతోటపల్లి సచివాలయాల్లో ఉచిత ఆధార్ క్యాంపులు జరుగుతాయని గ్రామస్థులు వినియోగించుకోవాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చామలూరులో..

నార్పల: మండలంలోని చామలూరులో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సర్పంచ్ ఆకులేటి స్వప్న ఆధ్వర్యంలో బి. పప్పూరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పలు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025, అంతర్గత హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుతాయన్నారు. పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన 35టీమ్‌లు తమ వినూత్న ఆలోచనలు, సాంకేతిక ప్రతిభను ప్రదర్శించారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్టరి ఆఫ్ ఎడ్యుకేషన్ రిలీజ్ చేసిన వివిధ ప్రాబ్లమ్స్ స్టేట్‌మెంట్లను తీసుకొని, వాటికి సంబంధించిన సమాధానాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. న్యాయనిర్ణేతలుగా ఎస్కేయూ ఏబీసీ జ్యోతి, ఖాదర్‌బాషా, ప్రొఫెసర్ భార్గవి వ్యవహరించారు. కన్వీనర్ నరసింహులు, కోఆర్డినేటర్లు రాజేష్, శారద, ప్రదీప్, అమృత, రాజేష్‌బాబు, షాషావలి పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

రాప్తాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సాకే తిరుపాలు

రాప్తాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా రాప్తాడు గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాకే తిరుపాలు, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ కలిసి సుమారు 22 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఒక జత సాధారణ దుస్తులు, ఒక జత యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు.

అన్నపూర్ణేశ్వరిగా అమ్మోరు

- నవరాత్రుల్లో మూడో రోజున ప్రత్యేక అలంకరణలు
- పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్న భక్తులు


కొత్తూరు అమ్మవారిశాలలో అద్దాలతో వాసవీమాతకు అలంకారం

అనంతపురం టౌన్/క్లాక్‌టవర్/బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజున బుధవారం నగరంలోని చాలా ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చారు. వేకువజామునే అర్చకులు అమ్మవార్ల మూలవిరాట్‌లను వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక ఆలయాల్లో అన్నపూర్ణేశ్వరీదేవి అలంకరణ చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక సుభాష్‌రోడ్డులో గల శ్రీకృష్ణదేవరాయభవన్‌లో ఉన్న అర్బన్ బ్యాంకులో అమ్మవారు అన్నపూర్ణేశ్వరిదేగా దర్శనమిచ్చారు. మై భారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బిసాటి భరత్, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ దర్శించుకున్నారు. అక్కడ హరిప్రసాద్ శిష్యబృందం చేసిన సాంస్కృతికి నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే బుక్కరాయసముద్రంలోనూ పెద్దమ్మ, ముసలమ్మ, వాసవీఅమ్మవారు వివిధ అలంకరణలలో దర్శనమిచ్చారు.


పాతూరు అమ్మవారిశాలలో రోజాపూలతో వాసవీమాత దర్శనం


రామచంద్రనగర్ షిర్డీసాయి ఆలయంలో అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిస్తున్న దుర్గామాత


హెచ్చెల్సీ కాలనీలో కొల్హాపూర్ మహాలక్ష్మి


సూర్యానగర్‌లో మల్లాలమ్మ


బీకేఎస్‌లో ముసలమ్మ అమ్మవారు

రోడ్డు పనుల పరిశీలన

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలంలోని భైరవాన్‌తిప్ప క్రాస్ వద్ద వేపుల పర్తి నుంచి శెట్టూరు వరకు రూ.12 కోట్ల నాబార్డు నిధులతో నిర్మాణం చేపడుతున్న బీటీ రోడ్డు పనులను పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జున మూర్తి , సబ్ డివిజన్-1 డీఈ లోకన్న, ఏఈఈ పద్మజ కలిసి బుధవారం పరిశీలించారు. అక్కడ నాణ్యతాపరమైన పరీక్షలు చేశారు. ల్యాబ్‌లో పరీక్షల నిమ్మితం నమూనాలు సేకరించారు. అనంతరం ఈఈ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ విభాగంలో చేపట్టే నూతన రోడ్లను నాణ్యతతో నిర్మించాలని స్థానిక సిబ్బందికి ఆదేశించారు. డీఈఈ నాగేంద్రకుమార్, ఏఈఈ బీటీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరియాన్‌చెరువు, ఎన్ఎస్‌గేటు, వెంకటంపల్లి, మేడాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. రామగిరి 220 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటింటా చెత్త సేకరిస్తున్నారా?

- బుక్కచెర్లలో జడ్పీ సీఈఓ ఆరా


గ్రామస్థులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శివశంకర్

రాప్తాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఇళ్ల వద్దకు వచ్చి చెత్తను సేకరిస్తున్నారా లేదా అని జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ ఆరా తీశారు. మండలంలోని బుక్కచెర్లలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి పారిశుధ్య కార్మికులు ఇంటింటా తిరిగి చెత్తను సక్రమంగా సేకరిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం అక్కడి చెత్తతో సంపద తయారీకేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ ప్రేమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం తనిఖీ

గార్లదిన్నె: మండలంలోని కేశవాపురంలో గల చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ యోగానందరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ప్రతి రోజూ చెత్త బండి ద్వారా గ్రామంలో చెత్తను సేకరిస్తున్నారా అని పారిశుధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి చెత్తను ఎక్కడ పడితే అక్కడ రోడ్ల మీద వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త బండిలో చెత్తను వేయాలని గ్రామస్థులకు సూచించారు. ముఖ్యంగా తడి, పొడి చెత్తను వేరుచేసి వేయాలని తెలిపారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి


విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాలనీవాసులు

అనంతపురంరూరల్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్డీటీ సేవలను కొనసాగింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాజీవ్ కాలనీ పంచాయతీ వాసులు కోరారు. ఆమేరకు శిల్పారామంలోని ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద సేవ్ ఆర్డీటీ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బుధవారం అన్ని రాజకీయపార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ.. పేదలకు ఆర్డీటీ ఎన్నో రకాలు సేవలందిస్తోందన్నారు. ఈ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేసి సేవలు కొనసాగేలా చూడాలని కోరారు. ఉపసర్పంచు మసూద్, టీడీపీనాయకులు నబీరసూల్, దాదాపీర్, అశోక్, ప్రజాసంఘం నాయకులు టీవీరెడ్డి, బీమ్‌సేన్ రావు, కృష్ణమూర్తి, వెంకటప్ప, వెంకటనారాయణ, రాము, శ్రీనివాసులు, రాజీవ్ కాలనీ, మరాఠీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్రను విస్తృతంగా నిర్వహిద్దాం'


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న భవాని రవికుమార్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రజలకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు తగిన తోడ్పాటును అందించాలని స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్ కలెక్టర్ ఆనంద్ ను కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం పలు సమస్యతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, మొక్కలు నాటడానికి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. అనంతరం డీఆర్వో మలోలాను కలిసి పలు సమస్యలపై చర్చించారు.

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు అజయ్‌బాబు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు తిరుపాల్, ఉపాధ్యక్షులు సురేష్‌బాబు, ఓబుళేసు, వెంకట నరసయ్య, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శింగనమల,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శింగనమల ఐసీడీఎస్ సీడీపీఓ చల్లా లలితమ్మ సూచించారు. మండలకేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాయంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సీడీపీఓ పాల్గొని చిన్నారులకు అన్న ప్రాసన చేయించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వారికి ఆరోగ్యం పట్ల తీసుకునే జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని అంగన్వాడీ సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి శాస్త్రవేత్త సుధారాణి, సూపర్‌వైజర్లు కల్పన, వాణిశ్రీ, కౌసల్య, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీధి వ్యాపారులకు లోక్ కల్యాణ్ మేళా

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో గురువారం వీధి వ్యాపారుల కోసం లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి బుధవారం తెలిపారు. వీధివ్యాపారులకు రుణాలు చెల్లింపు, జీవనోపాధుల పెంపుపై అవగాహన కల్పించేందుకు గాను మేళాకు బ్యాంకు మేనేజర్లు, కార్మికశాఖ, సివిల్‌సప్లై, వైద్యఆరోగ్యశాఖ, ఆహారకల్తీ, ఐసీడీఎస్‌లతో పాటు మెప్మా, టౌన్‌వెండింగ్ కమిటీ సభ్యులు హాజరవుతారన్నారు. నగరంలోని వీధి వ్యాపారులు హాజరుకావాలని కోరారు. ఏఎంసీలోని న్యూకౌన్సిల్‌హాల్‌లో లోక్ కళ్యాణ్ మేళా ఉంటుందని తెలిపారు.

హంసవాహనంపై శ్రీవారి దర్శనం


హంసవాహనంపై సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరాను పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని ఆర్ఎఫ్ రోడ్డులో గల లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజున బుధవారం శ్రీవారు హంస వాహనంపై సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. తొలుత అర్చకులు ఆలయంలో భూదేవి,శ్రీదేవి సమేతస్వామివారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, కుంకుమార్చనలు, అలంకరణలు, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో విష్ణుసహస్ర నామ హోమం, దీక్షాహోమం జరిపారు. సాయంత్రం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన హంసవాహనంపై శ్రీవారిని ఆశీనులు గావించి సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

అనంతలక్ష్మి పాఠశాలలో దసరా వేడుకలు


అమ్మవారి వేషధారణలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లి గ్రామ సమీపంలో గల అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ అనంత రాముడు, కరెస్పాండెంట్ రమేష్‌నాయుడు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం పలువురు విద్యార్థినులు అమ్మవారి వేషధారణలో నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు.కార్యక్రమంలో సీఏఓ నరసింహారావు, హెచ్ఎం శాలిని, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

అనంతపురంరూరల్: మండలంలోని ఇటుకలపల్లి గ్రామ సమీపంలో గల అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బత్తలపల్లి రక్తనిధి కేంద్రం సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటైంది. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ అనంత రాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, ప్రిన్సిపాల్ హాజరయ్యారు. చైర్మన్ మాట్లాడుతూ.. మనిషి ప్రాణాలను రక్షించగల అత్యంత గొప్ప సేవ రక్తదానమన్నారు. ప్రతి మనిషి రక్తాన్ని దానం చేయడం తమ కర్తవ్యంగా భావించాలన్నారు. అనంతరం 87మంది విద్యార్థులు, కళాశాల సిబ్బంది రక్తదానం చేశారు. కళాశాల నైపుణ్యాభివృద్ధి సంచాలకుడు సురేంద్రనాయుడు అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో భేటీ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ నాయకులు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కలిశారు. విజయవాడలో బుధవారం ఆయన్ను కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైఎస్ రావు, అనంతపురం రీజనల్ ప్రధాన కార్యదర్శి ఈడీ ఆంజనేయులు చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వివరించి పరిష్కారానికి సహకరించాలని కోరారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సేవా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రధాన వక్తగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కేంద్ర యువజన శాఖ మైభారత్ రాష్ట్ర కో ఆర్డినేటర్ భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర యువజన యంత్రిత్వశాఖ విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. వివిధ కార్పొరేట్ సంస్థలు, భారత ప్రభుత్వ విభాగాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు లభించే అవకాశాలను తెలియజేశారు. సియాచిన్ పర్యటనకు ఎంపికైన తిప్పేస్వామి, ప్రీ ఆర్డీకి ఎంపికైన అజయ్‌కుమార్‌ను అభినందించారు. ఎన్ఎస్ఎస్ క్యాంపులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు పథకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోర్డినేటర్ జితేంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్ విష్ణుప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్లు బాలాజీనాయక్, నాగభూషణం, నుగప్ప, శ్రీనివాసులు, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల కన్వీనర్

కనగానపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.90 వేలు మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను మండల కేంద్రంలో బుధవారం టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముత్తవకుంట్లకు చెందిన తలారి వరాలమ్మ, ఈడిగ నాగేశ్వరి, రాంపురానికి చెందిన గొడుగు వన్నూరమ్మ, మామిళ్లపల్లికి చెందిన ఓబులపతి, మద్దలచెరువుకు చెందిన గోపాల్ నాయక్ చెక్కులు అందుకున్నారు. అనంతరం వారు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బిల్లే దాము, నాయకులు రాంపురం వడ్డే నాగభూషణం, శీనా పాల్గొన్నారు. అలాగే మండలవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులను రేషన్ లబ్ధిదారులకు టీడీపీ నాయకులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

'సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం'

రామగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది 2029లోపు రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని వయోజన విద్య పర్యవేక్షకుడు వెంకటరమణ అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం ఆయన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఉల్లాస్- అక్షరఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వయోజనవిద్య, డీఆర్‌డీఏ, ఎన్ఆర్‌జీఎస్ శాఖల ఆధ్వర్యంలో మండలంలో 1900 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా అక్షరఆంధ్ర వలంటీర్లు పని చేయాలన్నారు. ప్రతి పదిమంది నిరక్షరాశ్యులకు ఒక వలంటీర్ సాయంత్రం సమయంలో చదువు చెబుతారన్నారు. అనంతరం బోధించే విద్యావిధానం గురించి వలంటీర్లకు అవగాహన కల్పించి అక్షర ఆంధ్ర వాచకాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఎంఈఓ ప్రకాశ్, ఏపీఎం అనసూయమ్మ, ఏపీఓ శంకర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య, వెలుగు సీసీలు, అకౌంటెంట్లు, యానిమేటర్లు, ఉపాధి పీల్డ్‌అసిస్టెంట్లు, అక్షర ఆంధ్రవలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో వింత పోకడ

- డీఎంహెచ్ఓ రాకపోతే.. కార్యాలయమంతా ఖాళీ
- ఏ విభాగంలోనూ కనిపించని అధికారులు, సిబ్బంది
- మధ్యాహ్నం 12 గంటలైనా విధులకు రాని వైనం

ఆంధ్రజ్యోతి విజిట్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆ కార్యాలయం నిత్యం కిటకిటలాడుతుంటుంది. అయితే ఆ శాఖలో కీలకమైన అధికారి సెలవు పెడితే మాత్రం.. ఆ రోజంతా ఆ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది కూడా సెలవే. ఇంతకీ ఆ కార్యాలయం ఏంటనుకుంటున్నారా..? జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం. ఆ శాఖను పర్యవేక్షించే జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఈబీ దేవి బుధవారం సెలవులో వెళ్లారు. ఆ సమయంలో ఆంధ్రజ్యోతి ఆ కార్యాలయాన్ని విజిట్ చేయగా... వింతపోకడ బయటపడింది. ఆమె రాలేదని, ఆ కార్యాలయంలో ఏ అధికారి కూడా రాలేదు. ఏ విభాగం చూసినా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా కార్యాలయంలో ఉన్న 20 విభాగాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం 12 గంటలు కావస్తున్నా... ఒకరిద్దరు అదికూడా చిరుద్యోగులు మాత్రమే కనిపించారు. మిగిలిన ఉన్నతస్థానాల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు కనిపించలేదు. సాయంత్రం 4 గంటలైనా విధుల్లోకి ఒక్క అధికారి కూడా రాలేదు. ఇదేంటనీ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఆరా తీస్తే... కొందరు ఉద్యోగులు మేడమ్‌కి సెలవైతే... మా అధికారులు కూడా ఆ రోజు అనధికారిక సెలవులో ఉంటారని బహిరంగంగా చెప్పారు. దీనిని బట్టి చూస్తుంటే... ఆ శాఖలో ఆ ఉన్నతాధికారంటే ఆ శాఖ ఉద్యోగులు, అధికారులకు ఏపాటి భయముందో ఇట్టే అర్థమవుతోంది. అధికారులు ఇలా అనధికారిక సెలవులో వెళ్లడం వెనుక దేవీ.. అభయం ఏమైనా ఉందా..? ఆ అభయంతోనే ఇలా అధికారులు బరితెగించి వ్యవహరిస్తున్నారా..? అనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మరి ఈ విషయంలో డీఎంహెచ్ఓ ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.


ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ కార్యాలయం


మలేరియా విభాగంలో ఖాళీ కుర్చీలు


ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగంలో..

జగజ్జననీ.. నమోస్తుతే..!

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మూడో రోజైన బుధవారం జగన్మాత.. వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానంగా అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారిని అలంకరించారు.


గుత్తిలో వాసవీమాతకు క్రేయాన్స్‌తో అలంకరణ


పామిడిలో గాయత్రీదేవిగా వాసవీమాత



గుంతకల్లు, రాయదుర్గంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు


విడపనకల్లులో చంద్ర ఘంట అలంకరణ


విజయవాడలో కనకదుర్గ అమ్మవారిని హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి బుధవారం దర్శించుకున్నారు. -కళ్యాణదుర్గం


కళ్యాణదుర్గం: బాలాత్రిపుర సుందరిగా వాసవీమాత

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న దాత

కుందుర్పి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన దంపతులు ముత్యాలమ్మ, నాగరాజు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. బుధవారం ఆ డబ్బును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న సీఐ మహానంది

ఉరవకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. సీఐ మహానంది మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే సేవాభావం, నాయకత్వ లక్షణాలు తదితర లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ ఆదినారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటరాముడు, పరమేష్, అధ్యాపకులు అయ్యన్న, రాజేష్, కృష్ణవేణి, సిరాజ్ అలీఖాన్ పాల్గొన్నారు.

సమావేశానికి అధికారుల డుమ్మా

శెట్టూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. చెర్లోపల్లి, తిప్పనపల్లి, చిన్నంపల్లి, పెరుగుపాలెం తప్ప.. మిగిలిన గ్రామ పంచాయతీల రికార్డులను సామాజిక బృందానికి అప్పగించలేదని ఎస్‌ఆర్పీ నీలకంఠ ఆగ్రహం వ్యక్తంచేశారు. కోట్లాది రూపాయలు పంచాయతీ రాజ్ పనులు జరిగినా సంబంధిత అధికారులు ఈ సమావేశానికి రాకపోవడంపై మండిపడ్డారు. రికార్డులు లేవని ఆడిట్ రిపోర్టులో పొందుపరుస్తామన్నారు. విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ సామాజిక బృందానికి ఉపాధి హామీ సిబ్బంది సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జీలానీబాషా, ఏపీఓ నీరజ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష శిబిరం

గుంతకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపల్ బాయ్స్ హైస్కూలులో దివ్యాంగ విద్యార్థులకు కృత్రిమ అవయవాలను సమకూర్చడానికి పరీక్షా శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు కృత్రిమ అవయవాలను సమకూర్చడానికి ముందుకు వచ్చిన అలింకో సంస్థ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జీసీడీఓ కవిత, ఎంఈఓ ఎం మస్తాన్ రావు, టీడీపీ నాయకులు తలారి మస్తానప్ప, కౌన్సిలరు మెహరున్నిసా బేగం, గుణశేఖర్, ఫజులు, రామన్న చౌదరి, హనుమంతు, అంజి, రంగన్న, గిడ్డయ్య, అంజలీదేవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

గుత్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పబ్లిక్ ఎస్ఈ రామ్మోహన్ రెడ్డి, కమిషనర్ జబ్బార్‌మీయా పేర్కొన్నారు. బుధవారం మంచినీటి పథకాలను వారు తనిఖీ చేశారు. స్పాట్ డెలవరీ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్, ఈఎస్ఎల్ఆర్ ట్యాంకులను పరిశీలించారు. వార్డుల్లో వాటర్ సప్లై పరిస్థితులను పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అమినిటీస్ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఈ హేమచంద్రకుమార్, ఏఈ గోవిందప్ప పాల్గొన్నారు.

త్వరలో గోకులం షెడ్ల బిల్లులు

యాడికి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గోకులం పథకం కింద షెడ్లు నిర్మించుకొని.. తొమ్మిది నెలలైనా మండలంలోని పది మందికి బిల్లులు మంజూరు కాలేదు. దీనిపై ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఉపాధిహామి పథకం ఏపీఓ చిన్నమద్దిలేటి.. బుధవారం వారిని ఉపాధిహామీ పథకం కార్యాలయానికి పిలిపించుకొని మాట్లాడారు. బిల్లులన్నింటిని రీ జనరేట్ చేశామని, త్వరలోగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు.

రైతు సమస్యల పరిష్కార వేదిక

గుమ్మఘట్ట, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది రైతులు వివిధ సమస్యలపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వాటి పరిష్కార నిమిత్తం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ రజాక్‌వలి పరిష్కార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, రైతులు సమక్షంలో సమస్యలను ఆరాతీశారు. వీటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

రిజర్వాయర్‌కు 2,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 2,440 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2,370 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.713 టీఎంసీలు నీరు ఉందని, ఫేజ్-2కు 1,904 క్యూసెక్కుల నీరు వెళుతుందని చెప్పారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు నమోదు

గుత్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వెబ్‌సైట్‌లో నమోదుకు టీముల ఎంపిక కార్యక్రమాన్ని పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించినట్లు కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ హ్యాకథాన్‌లో పాల్గొని తమ ఆలోచనలు పునరుత్పాదక శక్తి, అగ్రికల్చర్, స్మార్ట్ వేహికల్స్, క్లిన్ గ్రీన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీకి సంబంధించి వాటిలో తమ ఆలోచనలను ఈనెల 30లోపు తెలపాలని కేంద్ర ప్రభుత్వం కోరిందన్నారు. ఈ నమోదుకు తమ కళాశాలలో టీముల ఎంపిక కార్యక్రమాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం నిర్వహించిందన్నారు. రెండు టీములను ఎంపిక చేసి.. వెబ్‌సైట్‌లో నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శోభ, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఈ ఇంతియాజ్ బాషా పాల్గొన్నారు.


ఎంపిక చేస్తున్న కళాశాల యాజమాన్యం

యూరియా వాడకం తగ్గించాలి


చోళసముద్రంలో యూరియా అందజేస్తున్న సర్పంచ్ రమాదేవి

కూడేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): యూరియాను అధికంగా వాడటం వల్ల భూ సారవంతం క్షీణిస్తుందని, యూరియా వాడకాన్ని తగ్గించాలని జిల్లా రీసోర్స్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీఆర్సీ) పద్మలత సూచించారు. మండలంలోని చోళసముద్రం, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. అనంతరం చోళసముద్రం, పి.నారాయణపురం గ్రామాల్లో యూరియాను పంపిణీ చేశారు. ఇందులో చోళసముద్రం సర్పంచ్ వడ్డే రమాదేవి, స్థానిక టీడీపీ నాయకులు, రైతులు, మండలవ్యవసాయాధికారి శుభకర్ పాల్గొన్నారు.

గుంతకల్లులో ఏసీటీ ఫైబర్‌నెట్ సేవలు ప్రారంభం


ఏసీటీ ఫైబర్‌నెట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ అధికారులు

గుంతకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏసీటీ ఫైబర్‌నెట్ ఇంటర్నెట్ సేవలను స్థానిక నామాల సేట్ కల్యాణమండపంలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దారు రమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏసీటీ ఫైబర్‌నెట్ ప్రతినిధి తుమ్మల సీతారామారావు మాట్లాడుతూ... తమ నెట్‌వర్క్ కనీసంగా 50 ఎంబీపీఎస్ హైస్పీడ్‌తో నిరంతరాయంగా పనిచేస్తుందని, రూ.499 కనీస రిచార్జ్ టారిఫ్‌ను అందుబాటులో ఉంచామన్నారు. స్థానిక శేఖర్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ నిర్వాహకుడు మాధవరావు భాగస్వామ్యంతో ఫైబర్‌నెట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీటీ ఫైబర్ నెట్ అధికారులు సుబ్బారావు, హరీశ్, సిటీ కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా జయరాములు



గుమ్మఘట్ట,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా వీ జయరాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీఓ రామకృష్ణుడు ఉద్యోగోన్నతిపై జిల్లా కేంద్రంలోని డ్వామా కార్యాలయ ఏఓగా వెళ్లారు. వజ్రకరూరు ఈఓపీఆర్డీ జయరాములు ఉద్యోగోన్నతిపై ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కే వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదే కళాశాలలో ఇంగ్లీష్ విభాగంలో 32 సంవత్సరాలుగా అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ ఆయనకు నియామక పత్రాలను అందజేశారు. వెంకటేశ్వర్లను పలువురు అభినందించారు.

సీఈఓపై విచారణ

యల్లనూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): యూరియా, ఎరువులు పక్క మండలాలకు పోతున్నాయని జనసేన మండల కన్వీనర్ ఆదినారాయణ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. స్పందించిన తాడిపత్రి ఏడీఏ రవి స్థానిక వ్యవసాయ గోడౌన్‌లో రికార్డును పరిశీలించారు. స్థానిక సహకార సొసైటీలో సీఈఓ వీరనారప్పను విచారించారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడికెరలో అంగన్‌వాడీ కార్యకర్త నింగమ్మ అనారోగ్యంతో బుధవారం మరణించారు. ఆమె మృతదేహానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామాంజినమ్మ, యూనియన్ లీడర్స్ తిప్పీరమ్మ, సుజాత, అనిత, త్రివేణి అంగన్‌వాడీ కార్యకర్తలు నివాళులర్పించారు.

నేడు ఉచితంగా నానో యూరియా పిచికారీ

యల్లనూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లేపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వరిపొలాల్లో ఉచితంగా నానో యూరియా పిచికారి చేస్తున్నట్లు వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల రైతులు ఉదయం 10 గంటలకు సమీపంలోని వరిపొలాల వద్దకు రావాలని సూచించారు.

'ఓట్ల దొంగలు గద్దె దిగాలి'

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓట్ల దొంగలు గద్దె దిగాలి అన్న నినాదంతో పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గౌని ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల ఓటుహక్కును కాపాడటం కోసం పోరాటం చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు.


సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ

వైరస్‌కు వేపనూనెతో చెక్: జేడీఏ

ఉరవకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కంది పంటలో అక్కడక్కడా వైరస్ తెగుళ్ల ఉందని, వేపనూనె, వేపగింజల కషాయాన్ని పిచికారీ చేసి దాన్ని నివారించుకోవచ్చని జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కందికి పూత దశలో వచ్చే మరక మచ్చ తెగుళ్ల నివారణకు క్లోరో నైట్రీ, నిగ్రోల్ అనే మందును 60 మిల్లీలీటర్లను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓ రామకృష్ణుడు పాల్గొన్నారు.

గార్మెంట్స్ పరిశ్రమలు స్థాపించండి

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే గుమ్మనూరు వినతి


సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏసీఎస్ మిల్లు స్థానంలో గార్మెంట్స్ పరిశ్రమలను స్థాపించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అసెంబ్లీ లాబీలో సీఎంతో ఆయన బుధవారం మాట్లాడారు. దాదాపు రూ.300 కోట్ల విలువైన సామగ్రి వృథా మారిందని, ఇక్కడ పరిశ్రమలను స్థాపిస్తే దాదాపు వెయ్యిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. నియోజకవర్గంలో సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంట ఆయన కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్ ఉన్నారు.

బాలకృష్ణను కలిసిన జేసీ అశ్మిత్‌రెడ్డి



తాడిపత్రి, సెప్టెంబరు 24(ఆం ధ్ర జ్యోతి): విజయవాడ అమరావతి అసెంబ్లీ హాలులో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను బుధవారం కలిశారు. ఆయన వెంట కమలాపురం, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యకృష్ణారెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి ఉన్నారు.

సబ్ మార్కెట్‌యార్డు నిర్మాణానికి నిధులివ్వండి


మంత్రితో మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి

కణేకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సబ్‌మార్కెట్‌యార్డు నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని రాయదుర్గం మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని కోరారు. విజయవాడలో మంత్రిని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం కలిశారు. మార్కెట్‌యార్డు సమస్యలను పరిషారానికి వారంలోపు రూ. 4 కోట్లు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆయన వెంట డైరెక్టర్ చాంద్‌బాషా, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండాలో బానోత్ సుబ్బానాయక్ ఇటీవల మరణించారు. ఆయన కుటుంబానికి గ్రామ ఉద్యోగస్థుల కమిటీ సభ్యులు బుధవారం రూ. 8 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి రూ.8వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు.

యూరియా పంపిణీపై సీఐ పర్యవేక్షణ

బొమ్మనహాళ్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ పారదర్శకంగా జరగుతున్నదా లేదా అని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ బుధవారం పరిశీలించారు. మండలంలోని శ్రీధరఘట్ట, లింగదహాళ్, గోనేహాళ్ తదితర గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను సందర్శించారు వారి వెంట ఏఓ సాయికుమార్ ఉన్నారు.


శ్రీధరఘట్టలో యూరియా పంపిణీని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

క్రైం న్యూస్..

కేబుల్ చోరీ

యాడికి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు గ్రామం వద్ద గోపాల్‌నాయుడుకు చెందిన అరటితోటలో మంగళవారం రాత్రి దొంగలు 40మీటర్ల కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. దీనివిలువ సుమారు రూ.10వేలు ఉంటుందని గోపాల్‌నాయుడు తెలిపారు. తన తోటలో కేబుల్ చోరీ కావడం ఇది రెండోసారని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు రోజుల క్రితం బోయరెడ్డిపల్లిలో రామకృష్ణారెడ్డి తోటలో 30మీటర్ల కేబుల్ చోరీ అయింది.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కాల్వగడ్డవీధికి చెందిన సుల్తాన్‌పై మంగళవారం రాత్రి దాడి జరిగింది. పట్టణంలోని ఆసుపత్రిపాలెంలో ఇద్దరు మహిళలపై 2022 ఆగస్టులో పెట్రోల్ పోసి నిప్పంటించిన సుల్తాన్.. నాటి నుంచి అజ్ఞాతంలో ఉన్నాడు. రెండురోజుల క్రితం అతను తాడిపత్రికి వచ్చాడు. విషయం తెలుసుకున్న మృతుల బంధువులు రహంతుల్లా, అయూబ్, షాషు, ఖాజా మరికొందరు సుల్తాన్‌పై మంగళవారం రాత్రి దాడి చేశారు. స్థానికులు కేకలు వేయడంతో వారు పారిపోయారు. గాయపడిన సుల్తాన్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రాజశేఖర్ బుధవారం తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతానపల్లి గ్రామానికి చెందిన చిత్రయ్య పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం పట్టాలు దాటుతుండగా.. బెంగుళూరు వైపు నుంచి వచ్చిన రైలు ఢీకొంది. గాయపడిని అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్ట్

గుత్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మట్కా స్థావరాలపై బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించి.. ముగ్గురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వారి నుంచి రూ.25వేలు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ నాగమాణిక్యం, హెడ్‌కానిస్టేబుల్ నీలకంఠరెడ్డి పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సర్పంచ్ ముత్యాలమ్మ

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం చెన్నంపల్లిలో బస్సు షెల్టర్ నిర్మాణానికి సర్పంచ్ కోకా ముత్యాలమ్మ బుధవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో దీని నిర్మాణానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ రూ. ఐదు లక్షలు మంజూరు చేశారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

యాడికి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ సభ్యులు బుధవారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ (అనంతపురం), శంకర కంటి ఆసుపత్రి (బెంగళూరు) సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మత్స్యకేంద్రాన్ని పరిశీలించిన డీడీ

గుమ్మఘట్ట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీటీపీ రిజర్వాయర్ వద్ద ఉన్న చేపపిల్లల మత్స్యకేంద్రాన్ని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, ఎఫ్‌డీఏ ఆసీఫ్ బుధవారం పరిశీలించారు. చేపపిల్లల ఉత్పత్తిని పరిశీలించి మత్స్యక్షేత్రం అభివృద్ధిపై ఆరాతీశారు. వారి వెంట మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు శ్రీరాములు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పామిడి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఎంపీడీఓ తేజోత్స్న పంచాయతీ కార్మికులకు బుధవారం వైద్య పరీక్షలు చేయించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

తాడిపత్రి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంపై మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యురాలు అమరవాణి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం సంబరాలు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇందులో నాయకులు అంకాల్‌రెడ్డి, ఆంజనేయులు, చవ్వా రంగనాథరెడ్డి, రంగనాయకులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు